నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లాలో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకూ కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అధికారులు అందరు విధిగా హాజరవ్వాలని ఆయన ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి రాలేని అర్జీదారులు, Meekosam.ap.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

క్వారీల్లో నిబంధనలకు పాతర

- క్వారీలపై పర్యవేక్షణ కరువు
- పట్టించుకోని యంత్రాంగం
- లారీలతో తరచూ ప్రమాదాలు

యథేచ్ఛగా తవ్వుతున్న నల్లరాయి క్వారీలు

ప్రజాశక్తి - రౌతులపూడి

నల్లరాయి క్వారీలను లీజుకు తీసుకున్న యజమానులు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని పెడచెవిన పెడుతూ వ్యాపారాలు తమ జేబులను నింపుకుంటున్నారు. లీజులు ఇవ్వడంతో తమ పని పూర్తియిందన్నట్టు సంబంధిత శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. మండలంలోని ములగపూడి, ఎస్.పైడిపాల, ఉయ్యపుపాలెం, మల్లంపేట తదితర ప్రాంతాల్లో క్వారీల నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలకు నల్లరాయి పెద్దఎత్తున రవాణా అవుతోంది. రోజువారీ వందలది లారీలతో నల్లరాయి తరలిపోతోంది. తవ్వకాల నుంచి రవాణా వరకూ లీజుదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం విధించిన నిబంధనలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఆయా క్వారీల్లో కనీస భద్రతా చర్యలు లేకుండానే పనులను కానిచ్చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు వీరి ముందు దిగదుడుపే.

ఇష్టారాజ్యంగా తవ్వకాలు

స్టోన్ క్రషర్, క్వారీ తవ్వకాలకు సంబంధించి సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇష్టారాజ్యంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతులు తప్పనిసరి. ఎంత విస్తీర్ణంలో తవ్వుతున్నారో ముందుగానే సమాచారం ఇవ్వాలి. రవాణాకు సైతం పర్మిట్లు తీసుకోవాలి కానీ ఇక్కడ ఆలాంటివేమీ అమలు కావట్లేదు. కొన్ని మైనింగ్లకు సంబంధించి లీజులకు అనుమతులు ఉన్నా అధిక విస్తీర్ణంలో తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిపై పర్యవేక్షణ లేదు. గనుల శాఖ, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. కాని పూర్తిస్థాయిలో తనిఖీలు ఉండట్లేదు. నల్లరాయి రవాణాలోనూ మైనింగ్ యజమానులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవట్లేదు. భారీ వాహనాల్లో తరలించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రౌతులపూడి వెళ్లే రహదారి, గుమ్మరేగుల సెంటర్ వద్ద రహదారికి ఇరువైపులా భారీ వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రమైన రౌతులపూడికి విద్యాభ్యాసం నిమిత్తం వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగించడంతో ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందో తెలీక ప్రాణాలు గుప్పిట పట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ సెంటర్ వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

ప్రమాదాలు ఇవి

రౌతులపూడి, డిజె.పురం గ్రామాలకు చెందిన పలువురు ప్రయాణికులు క్వారీ లారీల వల్ల ప్రమాదాలకు గురై తీవ్ర గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయి. రౌతులపూడికి చెందిన మువ్వల శేషులు క్వారీ లారీ ఢీకొని ఆసుపత్రిలో మరణించాడు. కుటుంబానికి జీవనాధారమైన ఆయన చనిపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. పెళ్లీడుకు వచ్చిన పిల్లలతో మృతుని కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దుమ్ము ధూళి లేకుండా రహదారిని వాటరింగ్ చేయాలి. బ్లాస్టింగ్ సమయంలో సైరన్ మోగించాలి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో వాహనాల రవాణా నిలుపదల చేయాలి. లారీలపై టార్పాలిన్లు కప్పాలి. మైనింగ్ కార్మికులకు హెల్మెట్, షూలు వంటి వాటిని ఇవ్వాలి. పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలి. స్టోన్ క్రషర్ నడిపే గ్రామాల్లో ఆరు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలి.

ఉపాధి లేక అవస్థలు

పరిశ్రమలకు సంబంధించి క్వారీల్లో స్థానికులకు ఉపాధి దొరకట్లేదు. దీంతో వారు ఉపాధి నిమిత్తం వలసలు వెళ్లాల్సి వస్తుంది. స్థానికులకు యంత్రాలపై నైపుణ్యం లేకపోవడంతో మధ్యప్రదేశ్, ఒడిశా, బీహార్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకొస్తున్నారు. స్థానికులకు యంత్రాలపై నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి కల్పించాలనే డిమాండ్ ఉంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మేడిశెట్టి త్రిమూర్తులు

ప్రజాశక్తి-కాకినాడ

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న సిబ్బంది మాత్రం సమస్యల వలయంలో ఉన్నారన్నారు. చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు (గ్రాట్యుటీ, ఎర్నిలీవ్ డబ్బుల విషయంలో వారికి అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలన్నారు. ప్రస్తుత యాజమాన్యం అయిన భవ్య హెల్త్ కేర్ సర్వీసెస్ యాజమాన్యం కూడా ఉద్యోగుల సంక్షేమం ఏమాత్రం పట్టించుకోకుండా వారిపై తీవ్రమైన ఒత్తిడి పెట్టి పని చేయిస్తూ నిబంధనలను ఏ మాత్రం పాటించడం లేదన్నారు. ఇప్పటివరకూ నియామక పత్రాలు, పే స్లిప్స్ ఉద్యోగులకు అందచేయలేదన్నారు. వెంటనే అధికారులు, యాజమాన్యం యూనియన్ ప్రతినిధులతో మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి త్రిమూర్తులు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ఉద్యోగ నియమకాలు చేపట్టి బఫర్ సిబ్బందిని ఆర్ఎఫ్పి నిబంధనల ప్రకారం నియమించి ఉద్యోగుల మీద అదనపు భారం తగ్గించాలన్నారు. 104లో ఫార్మసిస్ట్ను నియమించాలని అప్పటివరకు డిఇఒలకు డ్రగ్స్ నిర్వహణ బాధ్యతలు తప్పించాలన్నారు. 2020 తరువాత చేరిన వారికి ఎవరికి జీతాల పెంపు లేనందున గత ఐదున్నరేళ్లుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిఎఫ్, ఇఎస్ఐలో విధించిన కోతలు సరి చేసి యాజమాన్య వాటా చెల్లించాలన్నారు. ఇఎస్ఐ పూర్తి స్థాయిలో అమలు చేసి అమలు నోచుకోని ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి త్రిమూర్తులు, కోశాధికారి సిహెచ్.శ్రీను, డివిజన్ లీడర్స్ హరిప్రసాద్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ న్యాయసేవల దినోత్సవం

సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి అపర్ణ

ప్రజాశక్తి-పిఠాపురం

పేద, బలహీన వర్గాలకు న్యాయ సేవలు, వారికి సామాజిక, ఆర్థిక న్యాయ కల్పన కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987 చేశారని పిఠాపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వి.వెంకట అపర్ణ తెలిపారు. ఆదివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బిసి బాలికల కాలేజీ హాస్టల్లో ఆదివారం నిర్వహించిన జాతీయ న్యాయ సేవల దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 1995, నవంబరు 9న ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం అమలుకు గుర్తుగా ఏటా నవంబరు 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవం నిర్వహించాలని సుప్రీంకోర్టు తీర్మానించినట్టు తెలిపారు. పిఠాపురం బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రెటరీ గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు మాట్లాడుతూ న్యాయం దృష్టిలో అందరూ సమానులేనని, న్యాయానికి గొప్ప, బీద అన్న తేడా లేదన్నారు. సీనియర్ న్యాయవాది కెఎస్ఆర్.భాస్కర్ మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు ఎటువంటి ప్రలోభాలకూ గురికాకుండా చదువులపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యావాదులు వాణిశ్రీ, జిపివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి, పారిశుధ్యంపై సర్వే

సర్వే చేస్తున్న ఆదిత్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రెండో రోజు ఇంటింటి సర్వే, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం విభాగం ఆదేశాల మేరకు కరకుదురులో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కరకుదురులో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సర్వేలో తడి చెత్త పొడిచెత్త వేరు చేస్తున్నారా లేదా, ఇంకుడు గుంతల వాడకం, మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థుల వివరాలు వంటి అంశాలతో పాటు, కంటి, దంత సమస్యలతో బాధ పడుతున్న వారి వివరాలను సేకరించారు. విద్యార్థులను చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, అభినందించారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సూరిబాబు రాజు

డ్రెయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -పెద్దాపురం

స్థానిక సారా వారి వీధిలో అర్ధాంతరంగా నిర్మాణ పనులు నిలిపివేసిన వర్షపు నీటి ప్రవాహ డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సారా వారి వీధిలోని డ్రెన్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక వ్యాపారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు డ్రైన్ నిర్మాణ పనులు ఆపివేయుడంపై వివరణ ఇస్తూ తుపాను కారణంగా పనులను తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. మేజర్ డ్రైన్ కావడంతో పనులు నాణ్యతతో జరగాలనే ఉద్దేశంతో ఆలస్యం అయ్యిందన్నారు. ఈ సందర్భంగా సూరిబాబు రాజు మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో వ్యాపారులకు, కొనుగోలుదారులకు, ప్రజలకు ఇబ్బందులు జరగకుండా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ పివి.సుధాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొరుపూరి రాజు, గౌతు శ్రీనివాసరావు, ఎం.కృష్ణ, మట్టే శ్రీనివాసరావు, కాపుగంటి కిషోర్, తాళ్లూరి కామేశ్వరరావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

కల్యాణ మండపం పనులకు రూ.10 లక్షల నిధులు

ప్రజాశక్తి - జగ్గంపేట

కాపు కళ్యాణ మండపం అదనపు పనులకు రూ.10 లక్షలు నిధులు అందిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హమీ ఇచ్చారు. ఆదివారంకళ్యాణ మండపం వద్ద కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఎంఎల్సి పేరాబత్తుల రాజశేఖర్, ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మండపం నిర్మాణం అయ్యిందని, ఇక్కడ కొన్ని వసతులు కల్పించాలని స్థానిక ఎంఎల్ఏ నెహ్రూ, సంఘం సభ్యులు కోరారని, వాటికి అవసరమయ్యే నిధులు అందిస్తామన్నారు. ఈ వనసమారాధనలో ప్రత్తిపాడు ఎంఎల్ఏ వరుపుల సత్యప్రభ, ఎంఎల్సి తోట త్రిమూర్తులు, మాజీ ఎంపీలు వంగా గీత, తోట నరసింహం, మాజీ ఎంఎల్సి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్ఏలు జ్యోతుల చంటిబాబు, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, వరుపుల సుబ్బారావు, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన ఐక్య వేదిక నాయకులు

ముద్రగడను కలిసిన ఐక్యవేదిక నేతలు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును ఆదివారం దళిత, గిరిజన, బిసి, ముస్లిం, క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడవుతూ ముద్రగడ పద్మనాభంతో ఉన్న అనుబంధం మరవలేనిదన్నారు. రాజకీయాల్లో నీతి నిజాయితీ గల నాయకునిగా, బలహీన వర్గాలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండే నాయకుడు ముద్రగడ పద్మనాభం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డోకుబుర్ర భద్రం, వరిపల్లి శివాజీ, గణేషన్, అవుపాటి ఉమాశంకర్, సాపే సుధాకర్, కొండేపూడి రవికుమార్, మాచిగిరి రాంబాబు, నందిక వీరబాబు, సిద్ధాంతపు రాజు, అమలదాసు నూకరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని సిఐ వైఆర్కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక బాలుర సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యాభ్యాసం అభ్యసించాలని, స్కూల్కు వెళ్లేటపుడు వచ్చేటపుడు జాగ్రత్తగా చూసుకుంటూ ఒకరి వెనుక మరొకరు వెళ్లాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాంగింగ్కు పాల్పడకూడదని, మత్తు పదార్థాల జోలికి పోరాదని, క్రమ శిక్షణతో మెలుగుతూ తోటి బాలురతో సోదర భావంతో మెలగాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ దష్టికి 100కు కానీ, 9440796529 నెంబర్కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన యుటిఎఫ్ నూతన మండల కమిటీ

ప్రజాశక్తి-పిఠాపురం

ఎపి ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్(యుటిఎఫ్) పిఠాపురం మండల కౌన్సిల్ సమావేశం స్థానిక సూర్యారాయ విద్యానంద గ్రంథాలయంలో పప్పు శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ కలిగిన సంఘం యుటిఎఫ్ అన్నారు. హక్కులు, బాధ్యతలు రెండు కళ్ళుగా రాష్ట్రంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘంగా నిలిచిందన్నారు. ఒకపక్క సమస్యలపై ఉద్యమాలు కొనసాగిస్తూ మరోపక్క సామాజిక అంశాలపై ఉపాధ్యాయులు స్పందిస్తున్నారన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా జి.సరస్వతిరాజు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పప్పు శ్రీనివాస్, దడాల ప్రవీణ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షునిగా ఎంవివి.సత్యనారాయణ, ఎస్వి.జ్యోతి, కోశాధికారిగా పాములయ్య, మహిళా కార్యదర్శిగా బి.గంగా భవాని, ఆడిటర్గా డి.రామకృష్ణ, గౌస్ జానీ, సత్యనారాయణ 12 మందితో కమిటీ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, సీతారామ రాజు, జిల్లా నాయకులు నగేష్, గణేష్, రమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

పోటీల్లో తలపడుతున్న బాక్సర్స్

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక ఆర్ఆర్బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు వివిధ విభాగాల్లో నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడిశెట్టి నాగేంద్ర కుమార్, ఎపి ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, ఎపి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సురేష్ కుమార్, జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రమణరాజు ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నలమూలల నుంచి 300 మంది బాల బాలికల పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్గా పిఠాపురం, రెండో స్థానంలో జి.భావారం, మూడో స్థానంలో కత్తిపూడి నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిబాబు, నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడానికి వ్యతిరేకంగా పార్టీలకు అతీతంగా ప్రజలు పోరాడాలని వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్ఛార్జి ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఉద్యమ పోస్టర్ను ఆవిష్కరించారు. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తీసుకొచ్చి ఐదు కళాశాల నిర్మాణం పూర్తి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరిస్తే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న ప్రత్తిపాడులో నిర్వహించే భారీ ర్యాలీకి ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఒమ్మి రఘురాం, పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద బాబు, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, వాగు బలరామ్, పైల విజయ్, జువ్విన వీర్రాజు, పేకల జాన్, బత్తిన శ్రీను ఉన్నారు.

స్విమ్మింగ్లో పల్లవికి రెండు పతకాలు

ప్రజాశక్తి-పెద్దాపురం

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఈత పోటీల్లో పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంకు చెందిన మన్యం పల్లవి అండర్-14 విభాగంలో రెండు పతకాలు సాధించిందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీమ్ మేనేజర్ బి.సురేష్ రాజు, కోచ్ జి.దుర్గాదేవి, విశాఖ జిల్లా పీడీ సతీష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్కే బీచ్లో ఉన్న ఆక్వా టెక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్లో నిర్వహించిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఈత పోటీల్లో ఆమె విశేష ప్రతిభతో ఈ పతకాలు సాధించిందన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రహదారులపై ప్రయాణించే వాహనదారులు మద్యం సేవించి వాహనాల నడపవద్దని ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు అన్నారు. ప్రత్తిపాడు హైవేలో ప్రయాణిస్తున్న వివిధ రకాలైన ట్రావెల్ బస్సులను ఆదివారం తనిఖీ చేశారు. డ్రైవర్ల రికార్డులను పరిశీలించారు. డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులను నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

వీరశివకు విశిష్ట సేవా పురస్కారం

ప్రజాశక్తి పెద్దాపురం

పెద్దాపురం మండలం ఆనూరు కొత్తూరుకు చెందిన కర్రి వీరశివకు విశిష్ట సేవా పురస్కారం లభించింది. ఆయన ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం లభించింది. కాకినాడలో ఇటీవల నిర్వహించిన చేయూత వార్షికోత్సవ సభలో ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎంఎల్సి పేరాబత్తుల రాజశేఖరం సన్మానించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందిస్తున్న జెడ్పిటిసి సాగర్

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి పంచాయతీ పాతకోరంగిలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు లయన్స్ క్లబ్ సాయం అందించింది. వృద్ధ దంపతులు చేకూరి అమ్మన్న, కళావతికి తాళ్లరేవు లయన్స్ క్లబ్, కురంగేశ్వర లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈ సాయం అందజేశారు. బియ్యం బస్తా, కిరణా సామాన్లు, రూ.7000 నగదు అందించారు. సత్వరం స్పందించిన క్లబ్ ప్రతినిధులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. బాధితులకు జెడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ రూ.3 వేల నగదు, రైస్ బేగ్, దుప్పట్లు, చీరలు, స్టీల్ సామాన్లు అందించారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారన్నారు. వీరి అవసరాలను దృష్టిలో పెట్టుకుని దాతల సహాయ సహకారాలతో అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్వి.అవధాని, శంకర్, ఆలయ ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

స్థలం వివాదంపై ఘర్షణ
- ఒకరిపై ఒకరు ఫిర్యాదు
-కేసులు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురంలో ఒక స్థలంలో దారి విషయంపై ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల ఘర్షణ దిగడం ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. స్థానికుల వివరాలు ప్రకారం ఆత్రేయపురం రామాలయం చింతనే ఉన్న 36 సెంట్లు భూమిని గ్రామానికి చెందిన ముదునూరి రామభద్రరాజు కొనుగోలు చేసి స్థలం చుట్టూ కంచె వేశారు. ఇదే స్థలం రామాలయం పక్కనే గల కాలినడక మార్గం ఉండేదని వేగేశ్న గోపాల రాజు, మరి కొంతమంది స్థానికులు గృహాలకు వెళ్లే దారి లేదంటూ కంచె తొలగించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం తన స్థలం చుట్టూ వేసిన ఫెన్సింగ్ గ్రామానికి చెందిన అల్లూరి ప్రసాద్‌రాజు తనకు చెప్పకుండా తన స్థలంలోకి ప్రవేశించి తొలగించారని రామభద్రరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే గ్రామానికి చెందిన అల్లూరి ప్రసాద్‌రాజు గ్రామంలో రామాలయం వద్ద దొడ్డన్నగారి రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో జనజీవనం స్తంభించిందని స్థానిక వీఆర్ఓ వరలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

గోదావరిలో స్నానానికి దిగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని కేదార్లంక వద్ద ఆదివారం గోదావరి నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందాడు. అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన నామిడి బన్ను (17) కేదార్లంక శివారు వీధి వారింటి ధనమ్మ మఠం వద్దకు స్నేహితులతో కలిసి వచ్చాడు. అనంతరం ముగ్గురు స్నేహితులతో కలసి గోదావరిలో స్నానానికి దిగాడు. వీరిలో బన్ను గల్లంతయ్యాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి నామిడి అబ్బులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడు బన్ను పదవ తరగతి చదువుతున్నాడు.

మూడు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో బొండు మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఆదివారం సీతానగరం మండలంలోని కైలాసగిరి ర్యాంపు ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా బొండుమట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు రెవెన్యూ అధికారులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు అధికారులు ఆ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో, అనుమతులు లేకుండా బొండుమట్టిని లోడ్ చేసి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించారు. వాటిని సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం సీతానగరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

నూతనంగాఎన్నికైన నగర కమిటీతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో స్థానిక పిఆర్ ఒకేషనల్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు ఎ.వాసుదేవ్ ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించి నగర మహాసభలను ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ వంటి సంఘాల్లో చురుగ్గా పాల్గొని ధైర్యంగా ప్రశ్నించాలన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయని, ఎన్ఇపి-2020ని తక్షణమే రద్దు చేయాలని, విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నగర కమిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎ.వాసుదేవ్, పగడాల సత్యం, ఉపాధ్యక్షులుగా అమృత, సిహెచ్.సాహిత్, తేజ, గమిని వేలు, సహాయ కార్యదర్శిగా మణికంఠ, కరుణ్, హాసిని, ఎన్నికయ్యారు.

ప్రణాళికాబద్ధంగా పది పరీక్షలు

ప్రజాశక్తితో ఆర్‌జెడి నాగమణి



ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం చేస్తున్నామని పాఠశాల విద్య రీజనల్ డైరెక్టర్ జి.నాగమణి తెలిపారు. ఈ ఏడాది కూడా రీజియన్ పరిధిలో పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా 100 రోజుల ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతిలో ఎంత మంది పరీక్షలు రాసారు. ఎన్ని కేంద్రాల్లో జరిపారు

జూన్ 2 రీజనల్ పరిధిలో ఏడు జిల్లాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలు జూన్ మొత్తంగా 960 కేంద్రాల్లో నిర్వహించగా 1,76,087 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో కాకినాడ జిల్లాలో 142 కేంద్రాల్లో 28,963 మంది, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 110 కేంద్రాల్లో 19,217 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 134 కేంద్రాల్లో 24,763 మంది, ఏలూరు జిల్లాలో 133 కేంద్రాల్లో 25,179 మంది, పశ్చిమ గోదావరి జిల్లాలో 129 కేంద్రాల్లో 24,393 మంది, కృష్ణా జిల్లాలో 145 కేంద్రాల్లో 22,341 మంది, ఎన్‌టిఆర్ జిల్లాలో 168 కేంద్రాల్లో 31,231 మంది హాజరయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో 2026 మార్చి 16 నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఇంకా ఎన్‌రోల్‌మెంట్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలు, ఇతర ఏర్పాట్లు త్వరలోనే పూర్తి చేయనున్నాం.

100 రోజుల కార్యాచరణ ఎప్పటి నుంచి మొదలవుతుంది

పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఏటా 100 రోజుల కార్యాచరణను అమలు చేస్తున్నాము. ఈ ఏడాది కూడా డిసెంబర్ 1 నుంచి ఈ ప్రణాళికను అమలు చేస్తాము.

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేస్తున్నాము. అందుకే తగిన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

విద్యార్థులపై ఎటువంటి దృష్టి సారిస్తున్నారు

ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ప్రధానంగా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించాం. ప్రతి విద్యార్థినీ ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, వారి అభ్యసన స్థాయిని నిరంతరం పరిశీలించాలని తెలిపాం. పాఠ్యాంశంలో వెనకబడి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఆదేశించాము. ప్రతిరోజూ ఒక పాఠ్యాంశం చొప్పున రివిజన్ చేయాలని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

సిలబస్ పూర్తికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు

మండల, జిల్లాస్థాయి విద్యాశాఖాధికారులు నిత్యం పాఠశాలలను సందర్శించి, బోధన విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయిపై సూచనలు జారీ చేస్తున్నారు. పాఠశాలలో సిలబస్ పూర్తి చేయని ఉపాధ్యాయులు పక్కాగా ఈ నెలలో సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించాం. వెనుకబడిన విద్యార్థుల కోసం ఇప్పటికే స్టడీ మెటీరియల్ ప్రతి పాఠశాలకూ అందించాము.

ఉత్తమ ఫలితాల సాధనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ 6 పీరియడ్లు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాము. ఆరో పీరియడ్లో విద్యార్థులకు పరీక్షను నిర్వహించాలి. స్టడీ అవర్స్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రత్యేక సిసిఎల్ మంజూరు చేస్తారు. ప్రతిరోజూ సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని సంబంధిత విద్యార్థులతో పరీక్ష రాయిస్తున్నాం. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. తరగతిలోని 6 నుంచి 8 మంది విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసుకుంటారు. అలా తీసుకున్న విద్యార్థులు ఉత్తమమైన మార్కులు సాధించేందుకు అవసరమైన మెళకువలను నేర్పుతారు.

ఎటువంటి సూత్రాలను అమలు చేస్తున్నారు.?

జిల్లావ్యాప్తంగా ఏటా ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉన్న పాఠశాలల్లో బోధనను అధికారులు నిత్యం పర్యవేక్షించాలి. శాఖాధికారులు ప్రతిరోజూ పాఠశాలలను సందర్శించాలి. ఆ సమయంలో విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి, బోధన తీరు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి. క్లిష్టమైన పాఠ్యాంశాలైన గణితం, ఆంగ్లం, సైన్స్ బోధన ఎలా సాగుతోందో పక్కాగా పరిశీలించాలి. ఆయా పాఠ్యాంశాల్లో బోధించే ఉపాధ్యాయులు సబ్జెక్టు వారీగా పరీక్షల్లో తప్పకుండా వస్తాయని భావించే ప్రశ్నలను విద్యార్థులకు బోధించాలి.

సులువుగా అర్థమయ్యేలా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు

పరీక్షల్లో తప్పకుండా ఇస్తారు అని భావించే ప్రశ్నలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుని రాసేలా మెళ్లగానే శిక్షణ ఇవ్వాలని చెబుతున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారు ప్రతి సబ్జెక్టులోనూ ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలి. పరీక్షల్లో తప్పక వస్తాయని భావించే ప్రశ్నలను ప్రతిరోజూ పరీక్షలో చూడకుండా రాయించాలి. ఉపాధ్యాయులు ప్రతివారం విద్యార్థుల సామర్థ్యానికి సంబంధించిన నివేదికను రూపొందించి వారికి ఇవ్వాలి. బాగా వెనుబడిన విద్యార్థులను దత్తత తీసుకుని వారికి శిక్షణ ఇవ్వాలి. పాఠశాల హెచ్‌ఎం ప్రతివారం విద్యార్థులు ఎన్ని మార్కులు సాధిస్తారనే అంశంపై నివేదిక రూపొందించి, ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేయాలి.

యానాం వార్తలు

మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దుర్గాప్రసాద్, కార్మికులు

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - యానాం

విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకూ నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో పాలకుల విధానాల వల్ల కార్మిక వర్గంపై పడుతున్న ప్రభావాన్ని వివరించారు. కార్మికులు సంఘటితంగా పోరాడితే విజయం కార్మికులదే అన్నారు. అనంతరం సిఐటియు అఖిల భారత మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ముందుగా స్థానిక మార్కెట్‌లో యానాం రైస్ మిల్స్ జనరల్ బాడీ సమావేశం వాసంశెట్టి అర్జున్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పాల్గొని రైస్ మిల్స్ నూతన వేతన ఒప్పందంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తీరుకోటి శ్రీనివాసరావు, గుత్తాల బాలరాజు, బొంతు హరికృష్ణ, సలాది నాగబాబు, మత్సేటి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, వాకపల్లి వెంకటేశ్వరరావు, నూకరాజు, అప్పారావు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌గా యానాం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ యానాం జట్టు విజయం సాధించిదని ఆదివారం విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తెలిపారు. కొద్ది రోజులుగా కేరళ వద్ద నున్న మాహే ప్రాంతంలో పుదుచ్చేరి స్టేట్ స్కూల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు యానాం నుంచి 50 మంది క్రీడాకారులు బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, వాలీబాల్, ఫుట్బాల్ తదితర క్రీడాంశాల్లో పోటీపడ్డారన్నారు. జోన్-4 పుదుచ్చేరి జట్టుపై యానాం జట్టు ఘనవిజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుందన్నారు.

కాంగ్రెస్ యానాం ఇన్‌ఛార్జిగా కాటంశెట్టి

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా కాటంశెట్టి రామ్మూర్తిని నియమిస్తూ ఆదివారం పుదుచ్చేరి పిసిసి అధ్యక్షుడు, ఎంపి వైదిలింగం ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ నేతలను కలుపుకుని క్షేత్రస్థాయిలో విస్తతంగా ప్రచారం చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

కాకినాడ కలెక్టర్‌ను కలిసిన మల్లాడి

ప్రజాశక్తి - యానాం

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మల్లాడి

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్మోహన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదివారం కలిశారు. ఓఎన్‌జిసి పైప్‌లైన్ లీకేజీపై మరోకసారి వినతిపత్రం అందజేశారు. గ్యాస్ పైప్‌లైన్ లీకేజీకు సంబంధించి మత్స్యకారులకు, ప్రజలకు పరిహారం, రాబోయే రోజుల్లో చేపట్టవలసిన రక్షణ చర్యలు తదితర అంశాలపై చర్చించినట్లు మల్లాడి తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటా

ప్రజాశక్తి - అంబాజీపేట

నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎంఎల్‌ఎ గిడ్డి

కె.పెదపూడిలో జరిగిన అగ్ని ప్రమాదం బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆదివారం బాధితులను ఆయన పరామర్శించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. త్వరలోనే కొత్త ఇళ్ళు మంజూరు అయ్యేలా చూస్తానని అన్నారు. ఈ సందర్భంగా కట్టు బట్టలతో నిరాశ్రయులైన ఈతకోట మంగాయమ్మ, శ్రీనివాసరావు, సుబ్బా రావు, ఈశ్వరరావు కుటుంబాలకు నిత్యా వసర సరుకులు, బియ్యం, కూరగాయలు, తదితర సహాయ వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఐక్యమత్యానికి ప్రతీక వన సమారాధన

ప్రజాశక్తి - అంబాజీపేట

వన సమారాధనలో మాట్లాడుతున్న ఎంపిపి

ఐకమత్యానికి ప్రతీకగా కార్తీక వన సమారాధనలు నిలుస్తాయని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని మాచవరంలో శ్రీరామనగర్ వాసులు ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు, మహిళలకు చైర్, స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ఎంపిపి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి చినబాబు, మట్టపర్తి రాము, బొంతు రామకృష్ణ, మట్టపర్తి సత్యనారాయణ, చప్పిడి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - రావులపాలెం

ఆర్థిక సాయం అందజేస్తున్న టీమ్ సైతం ప్రతినిధులు

రావులపాలెం గ్రామానికి చెందిన లింగోలు సత్యవతి క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. ఈ నేపథ్యంలో టీమ్ సైతం స్వచ్ఛంద సేవా సంస్థ సంస్థ వ్యవస్థాపకులు అంబటి కిషోర్ సహాయనిధిని ఏర్పాటు చేసి విరాళాలు ద్వారా వచ్చిన రూ.15 వేలను బాధితురాలికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు విక్టరీ బద్రి, అవినాష్ చౌదరి, టీమ్ నేను సైతం కొవ్వూరి రేణుకారెడ్డి, కంఠంశెట్టి దేవిశ్రీనివాస్, ఆకుల జ్యోతి పాల్గొన్నారు.

14 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

జగ్గంపేట : 14 మందికి రూ.7 లక్షల 11 వేల సిఎం సహాయనిధి చెక్కులను టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆదివారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అందజేశారు. జీను మణిబాబు, బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, పాంద్రంగి రాంబాబు, రేఖ బుల్లిరాజు, బాదంపూడి ప్రకాష్, గల్లా శ్రీను, ముసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు ఉత్తమ అవార్డు

ఏలేశ్వరం : నిరుపేదలకు విశేష సేవలు అందించినందుకు ఏలేశ్వరం లరన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావుకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఈ మేరకు ఆదివారం తునిలో నిర్వహించిన లయన్స్ జోన్ సోషల్ మీట్‌లో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ సభ్యులు, ప్రకృతి పరావరణ పరిరక్షణ సంఘం సభ్యుల సహకారంతో సేవలు విస్తృతం చేస్తామని పేర్కొన్నారు

దస్తావేజులు పడిపోయినవి

డా" బి.ఆర్.ఏ.కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామానికి చెందిన గెద్దాడ గౌరీ W/o రాజుకు సంబంధించిన, తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి పంచాయతీ పరిధిలోని గ్రామ రెవెన్యూ తాలూకా సర్వేనెంబరు 167/1 డోర్ నెంబరు 5-304 ఖాళీ స్థలంకు సంబంధించిన లింకు దస్తావేజు నెంబర్ 1188/1996 ఒరిజినల్ దస్తావేజులు ది.29-10-2025 న మా ఇంటి నుండి సెంటర్లో గల జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినను దొరికియుండలేదు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు .

గెద్దాడ గౌరీ
W/o. రాజు, వెదురుముడి గ్రామం,
కపిలేశ్వరపురం మండలం.
సెల్:9550690814.

ముగిసిన క్రైస్తవ ప్రార్థన సభలు

ప్రజాశక్తి - రావులపాలెం

ముగింపు వేడుకలో మాట్లాడుతున్న పాస్టర్

మండల పరిధిలోని ఈతకోట గ్రామంలో ఓలీయుల స్వస్థత శాల ఆవరణలో పదవ వార్షికోత్సవ మహాసభలు ఆదివారం ముగిసాయి. శాల వ్యవస్థాపకులు పమ్మి అమృత అధ్యక్షతన గత మూడు రోజులుగా జరిగిన క్రీస్తు సువార్త మహాసభలకు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన బోధకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పాస్టర్స్ అధ్యక్షులు డేనియల్ పాల్, రెవరెండ్‌లు జాన్ గ్లోరియస్, జాన్ పీటర్సన్, క్రాంతికుమార్, అబ్దుల్ రజాక్, సికిలి ధనరాజ్, పాస్టర్ సువర్ణ రాజు, పాస్టర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు ప్రసాదం పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన యాత్రికులకు 1988-89 టెన్త్ క్లాస్ పివిఆర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రసాదం పంపిణీ చేశారు. ద్రాక్షారామలోని బోస్ సెంటర్ నుంచి వచ్చే యాత్రికులు అందరికీ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వాసంశెట్టి శ్యామ్, ఆకుల అచ్యుత్ రామరాజు, చిక్కాల నాగబాబు, పసుమర్తి రంగనాయకులు, తదితరులు సేవలు అందించారు.

శతాధిక వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -కరప

కూరాడ గ్రామంలో ఆదివారం శతాధిక వృద్ధుడు మోర్త అంద్రియ (104) మృతి చెందారని మాజీ ఎంపిటిసి సభ్యుడు చిన్నం వెంకటేశ్వరరావు తెలిపారు. పాస్టర్ అయిన అంద్రియకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలో సువార్త చేస్తూ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆయన మృతి పట్ల సంఘ సేవకులు, గ్రామ పెద్దలు, అంబేద్కర్ యువజన సేవా సంఘం యూత్ సంతాపం తెలిపారు.

ఫోటో మతి చెందిన శతాధిక వద్దుడు .

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ టి.రఘునాథరావు పెచ్చరించారు. శనివారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్టు ఆయన ఆదివారం మీడియాకు తెలిపారు. వీరిని నేడు కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

డ్రైవర్స్ కాలనీలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-పిఠాపురం

పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది డ్రైవర్స్ కాలనీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ఇళ్లను సోదా చేశారు. బైకులు, కార్లు, వ్యాన్లు తనిఖీ చేసి సరైన పత్రాల్లేని 45 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఊర్లో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు వస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఇంటి యజమానులు ఎవరికైనా ఇల్లు అద్దెకిచ్చే ముందు వారి వివరాలు తెలుసుకున్న తర్వాతే ఇళ్లు అద్దెకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వి.మణికుమార్, జాన్ బాషా, రామకష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

In the Court of the VI Additional District Judge at Kakinada(MACT)
M.V.O.P. No. 57/2025

Between:-
Motukuri Vijaya Lakshmi and Other's ...Petitioners
And
Ravinipalli Ashok Kumar and Other's ...Respondents

To.
R2. Bathula Malleswari W/o.Mallesh, R/o. D.No.3-55, Main Road, Chandrajupalem, Bellamkonda, Palnadu-522411 Owner of the Tata Intra Pickup van bearing No. AP39UV 8724

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.12-11-2025సం॥రం తేదికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30ని॥లకు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చు కోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
K.R.V.BHADRA RAJU
Advocate, Kakinada
Cell.944030449

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో: పిఠాపురం
I.A.No.116/24 in E.P.No.69/2019 in O.S.No.246/2015

మద్యన:
కొంజర్ల కొండబాబు ...పిటీషనర్/క్లయిమెంట్
మరియు
గింజాల రాజు వగైరా ...రెస్పాండెంట్
రెస్పాండెంట్ నెం:2

2. పసుపులేటి అనీల్ అనే అనీల్‌కుమార్ అనే అప్పారావు, తండ్రి: ఆదినారాయణ, వయస్సు 36 సం॥లు, హిందూ, వ్యాపారం, డో.నెం.5-15,బిసి కాలనీ, గంగాలమ్మ గుడి దగ్గర, వలసపాకాల, కాకినాడ రూరల్ మండలం

పై వ్యాజ్యంలో 2వరెస్పాండెంటు కోర్టులో హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ఎన్నిమార్లు నోటీసులు జారీ చేసినా కోర్టుకు హాజరు అగుటలేదు. కావున 2వ రెస్పాండెంట్ ది.13-11-2025వ సం॥రం॥ తేదీని ఉదయం 10.30ని॥లకు కోర్టువారి యెదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును. కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము తెలియజేయడమైనది.

వాయిదా : 13-11-2025
జి.డి.ప్రసన్నకుమార్
అడ్వకేట్, పిఠాపురం
సెల్.9395389211

ఘనంగా వనసమారాధనలు

పలుచోట్ల ఆదివారం వన సమానాధనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. పలు సాంస్కృతిక కార్యాక్రమాలను నిర్వహించారు. పలువురు ప్రముఖులను సత్కరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పెద్దాపురం చేనేత వర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముప్పన వారి గాలి బంగ్లాలో 27వ చేనేత వర్గాల కార్తిక వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెట్టి రాజబ్బాయి అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ చేనేత పరిరక్షణకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. 27 సంవత్సరాలుగా ఈ కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముప్పన శ్యామలాంబ, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, తూతిక రాజు, తూతిక సత్యనారాయణ, పేరిశెట్టి మత్యుంజయరావు పాల్గొన్నారు.

సామర్లకోట ఉండూరులో పేపకాయల వారి 9వ ఆత్మీయ సమావేశం, కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 160 గ్రామాలు, పట్టణాల నుంచి పేపకాయల వంశస్తులు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రంగంపేట మండల జెడ్‌పిటిసి పేపకాయల రాంబాబు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు మాట్లాడారు. అనారోగ్యంతో ఉన్న వారు, మరణించిన వారి కుటుంబాలకు సాయం చేయడానికి ఒక ట్రస్టును ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పిఠాపురం రోడ్డులో అబ్బాయి పొలంలో కార్తీక వనసమారాధన విజయవంతంగా నిర్వహించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి విప్పర్తి కొండలరావు, లింగం శివప్రసాద్, సింగంపల్లి శ్రీనివాస్, పి.ప్రసాద్, గుండు శంకరరావు, గంటా సతీష్, గోపి వెంకటేశ్వరరావు, సత్యానందం, మనిరాజు, రాజా, నజీర్, స్టూడియో ప్రసాద్, బుల్లి రాజు, అందుగుల జార్జి చక్రవర్తి, గొల్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వనసమారాధనలో మంత్రి సుభాష్ , ఎంపీ, ఎంఎల్ఎలు

కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ ఆధ్వర్యంలో 5వ కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి సుభాష్, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, శాసన మండలి విప్ పిడుగు హరి ప్రసాద్, ఎంఎల్‌సిలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు, ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ, కుడిపూడి సత్తిబాబు, వేగుళ్ల లీలా కష్ణ, రెడ్డి అనంతకుమారి, తోట సుధీర్, డిసిసి చైర్మన్ తుమ్మల బాబు, సూర్యనారాయణ రాజు, శాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న తదితరులు హాజరయ్యారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

In the Court of the VI Additional District Judge at Kakinada
E.A No.8/2022, E.P.No.127/2023 in O.S.No.310/2020

Between:-
Themmana Boyina Chandra Mohan ...Petitioner/Dhr
And
Pepakayala Srinivasa Rao ...Respondent/Jdr

To.
Pepakayala Srinivasa Rao, S/o.Ganga raju, Business, Chandrampalem Village, Samalkota Mandal, Kakinada Dist, Yeleswaram.

పై నెంబరు E.A No.8/2022, పిటిషన్‌లో రెస్పాండెంటు/జెడిఆర్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.17-11-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చు కోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
గంగుమళ్ళ శ్రీనివాస్‌రావు
అడ్వకేట్, తిమ్మాపురం, కాకినాడ,
సెల్.9848039421

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

నాక్లయింటు రాజమహేంద్రవరం దానవాయిపేటలోని డోర్‌నెం.46-18-18 కాపురస్తులు వేములపల్లి బాబ్జిరామకృష్ణ గారి భార్య అయిన **కృష్ణకుమారి** గారు నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు తన ఇంటి డోర్‌నెం. 46-18-18 వద్దనుండి ఒరిజినల్ డాక్యుమెంట్స్ కలర్ జిరాక్స్ తీసుకునే నిమిత్తం ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.4144/1977 ది.22-10-1977 SRO రాజమండ్రి దానా సెటిల్‌మెంటు దస్తావేజు ఒరిజినల్ డాక్యుమెంట్ కలర్ జిరాక్స్ నిమిత్తం దివి.07-11-2025 సం॥తేదిన ఉదయం సుమారు 10.30 గంటలకు కలర్ జిరాక్స్ తీయు నిమిత్తం ప్రకాష్‌నగర్ రాజమండ్రి గల కలర్ జిరాక్స్ షాపునకు చేరేసరికి మా క్లయంటు తాలూకు ఒరిజినల్ దస్తావేజు డాక్యుమెంట్ నెం.4144/1977 ది. 22-10-1977 SRO రాజమండ్రి కవర్ దారిలో పడిపోయినవి. ఎంత వెతికిన నా క్లయంటుకు దొరకలేదు. కావున ఈ ప్రకటన ఇవ్వడమైనది. సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల నాక్లయింటు ఫోన్ నెంబరుకు గాని ఈక్రింది తెలిపిన అడ్రస్‌కు అందజేసినచో తగిన బహుమతి పొందగలరు. తదుపరి క్లయిములు ఏమియును చెల్లనేరవు నాక్లయంటు ఫోన్.8341105229

B.A.H.S.KRISHNA
Advocate, D.No.17-24-2
సీతంపేట,రాజమండ్రి
రాజమండ్రి 9-11-2025 సెల్.9603748086

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో: పిఠాపురం
I.A.No.117/24 in E.P.No.69/2019 in O.S.No.246/2015

మద్యన:
కొంజర్ల కొండబాబు ...పిటీషనర్/క్లయిమెంట్
మరియు
గింజాల రాజు వగైరా ...రెస్పాండెంట్
రెస్పాండెంట్ నెం:2

2. పసుపులేటి అనీల్ అనే అనీల్‌కుమార్ అనే అప్పారావు, తండ్రి: ఆదినారాయణ, వయస్సు 36 సం॥లు, హిందూ, వ్యాపారం, డో.నెం.5-15,బిసి కాలనీ, గంగాలమ్మ గుడి దగ్గర, వలసపాకాల, కాకినాడ రూరల్ మండలం

పై వ్యాజ్యంలో 2వరెస్పాండెంటు కోర్టులో హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ఎన్నిమార్లు నోటీసులు జారీ చేసినా కోర్టుకు హాజరు అగుటలేదు. కావున 2వ రెస్పాండెంట్ ది.13-11-2025వ సం॥రం॥ తేదీని ఉదయం 10.30ని॥లకు కోర్టువారి యెదుట వ్యక్తిగతంగా గాని, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును. కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము తెలియజేయడమైనది.

వాయిదా : 13-11-2025
జి.డి.ప్రసన్నకుమార్
అడ్వకేట్, పిఠాపురం
సెల్.9395389211